క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు తోడుగా ఉంటూ అన్ని విధాలుగా అండగా ఉంటామని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీరేపల్లి పంచాయతీలో మమేకం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మహేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, జేసీఎస్ కన్వీనర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం



కరాటే బెల్టులు ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కరాటేలో శిక్షణ పొంది కరాటే బెల్ట్ ఎక్సమ్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కరాటే బెల్టులను ప్రదానం చేశారు. స్థానిక కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో 70 మంది కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరచగా పట్టణంలోని వివేకానంద పాఠశాలలో సర్టిఫికెట్లు, బెల్టుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్ గోజు ర్యూ కరాటే ఆల్ ఇండియా చీఫ్ షిహన్ అల్తాఫ్ పాషా, స్కూల్ చైర్మన్ బైసాని రాంప్రసాద్ పాల్గొని బెల్టులు అందించారు.

రుచికరమైన భోజనాన్ని వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చిగమతిఘట్ట, సోమఘట్ట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.

సీపీఎం నాయకులపై కేసు నమోదు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో సీపీఎం నాయకుడు పెద్దన్నతో పాటు మరికొందరు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేయించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం పట్టాలు మంజూరు చేయాలని గోరంట్లలో ర్యాలీ చేపట్టారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో పాటు సీపీఎం నాయకులతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లే అవుట్ యజమానికి నోటీసులు

సోమందేపల్లి: మండలంలోని నల్లగొండ్రాయనపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన ఓ లే ఔట్‌ను ఈఓఆర్‌డీ నాగరాజురావు సోమవారం పరిశీలించారు. పంచాయతీతో పాటు అహుడా అనుమతులు లేకుండా ప్లాట్‌లు అమ్మకాలు చేపడుతున్నారని పలువురు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించకుండా నాటిన రాళ్ళను తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని స్థల యజమానులకు నోటీసులు జారీ చేశామని ఈఓఆర్డీ స్పష్టం చేశారు.

మోదాలో బైక్ చోరీ



బైక్‌ను తస్కరిస్తున్న దొంగ

పరిగి: మండలంలోని మోదాలో సోమవారం తిప్పేస్వామి అనే వ్యక్తికి చెందిన బైకు చోరీకి గురైంది. మోదా గేటు వద్ద నివాసముంటున్న తిప్పేస్వామి ఆదివారం రాత్రి తన ఇంటి వద్ద వాహనాన్ని నిలిపాడు. సోమవారం ఉదయమే ద్విచక్ర వాహనం కనిపించలేదు. బాధితుడు తన ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కెమెరాలో వేకువజామున ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని దొంగిలిస్తున్న విషయాన్ని గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

రిచ్‌మండ్ సిల్క్ యజమాని విఠల్ మృతి

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న రిచ్‌మండ్ సిల్క్ యజమాని గుండా విఠల్ (78) సోమవారం మృతి చెందారు. 1984లో రిచ్‌మండ్ సిల్క్ ప్రారంభించిన ఆయన 2004 వరకూ గార్మెంట్స్ నడిపారు. సంస్థ చైర్మెన్ అండ్ ఎండీగా విధులు నిర్వర్తించి ఆయన అప్పట్లోనే 300 మందికి పైగా ఉపాధి కల్పించారు. ఆయన మృతి పట్ల పలువురు మాజీ ఉద్యోగులు సంతాపం వ్యక్తం తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ భక్తులతో పోటెత్తాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఉదయం నుంచే ఆయా ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షిబృందం



గుడిబండ మండలం పీసీ గిరిలో విరుపాక్షేశ్వర ఆలయంలో లక్షదీపోత్సం



హిందూపురం పట్టణంలోని మేళాపురంలో అలంకరణలో శివయ్య



పరిగి: ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న బీరలింగేశ్వరస్వామి



హిందూపురం మండలం కిరికెర శివాలయం ఆవరణలో ..



లేపాక్షి: అలంకరణలో దుర్గాదేవి



హిందూపురం: జ్యోతిర్లింగ ప్రదర్శనలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్



హిందూపురం: శివాలయంలో ఏర్పాటు చేసిన దీపారాధనలో పాల్గొన్న మహిళా భక్తులు



పావగడ: నల్లరాళ్ల గంగమ్మ గుడిలో గిరిజా కల్యాణంలో పాల్గొన్న భక్తులు



హిందూపురం పట్టణంలోని త్యాగరాజనగర్‌లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఫుట్‌బాల్ పోటీల్లో పులమతి విద్యార్థుల ప్రతిభ

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి అండర్–18 విభాగంలో లేపాక్షి మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటినట్టు పీడీ రామాంజినేయులు సోమవారం తెలిపారు. ఫైనల్ పోటీల్లో హిందూపురం – లేపాక్షి జట్లు తలపడగా లేపాక్షి జట్టు విజేతగా నిలిచిందన్నారు. అయితే ఈ జట్టు క్రీడాకారులందరూ పులమతికి చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. ముఖ్యంగా బాలికల అండర్–18 విభాగం ఫుట్‌బాల్ పోటీల్లో వరుసగా రెండోసారి విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిఅనిల్‌కుమార్, కార్యదర్శి సలీం, ఆర్‌డీటీ ఫుట్‌బాల్ లీగ్ కోఆర్డినేటర్ కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు లోక్‌నాథ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే

పావగడ: బీజేపీ కాంగ్రెస్ రెండూ రెండేనని కర్ణాటక రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు చంద్రు విమర్శించారు. ఉచిత పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓ వైపు నిందిస్తూ బీజేపీ మాత్రం ఉచిత పథకాల హామీలను గుప్పిస్తోందని మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. అనంతరం తాలూకాలోని మరిదాసనహళ్లి, వైఎన్ హొసకోటలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసు కున్నారు. జిల్లా ఆప్ సంఘటనా కార్యదర్శి రామాంజినప్ప, తాలూకా ఆప్ అధ్యక్షుడు గోపాల్, నరసింహులు, ఆప్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కుషాల స్వామి, సంఘటనా కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు చంద్రు

జగనన్నతోనే ప్రజా సంక్షేమం సాధ్యం



పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



చిలమత్తూరు మండలం వీరాపురంలో సంక్షేమ లబ్ధి బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు



గుడిబండ: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన దృశ్యం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధి సచివాలయం 3 పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ సాకమ్మ, జెడ్పీటీసీ శ్రీరామప్ప, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, మండల కన్వీనర్ నరసింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీలు చిక్కన్న, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. మండల పరిధిలోని సంతేబిదనూర్‌లో సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మరోవైపు 37వ వార్డులో ఇన్‌చార్జి మనోహర్ ఆధ్వర్యంలో ఏబ్లాక్ కన్వీనర్ సాదిక్ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జనగ్ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందివ్వాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆశయం అని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. సోమవారం వీరాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్లు హనుమంతరెడ్డి, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామ సచివాలయం వద్ద సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ప్రదర్శించారు. జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, కలిపి సింగిల్ విండో చైర్మన్ కేపీ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: రాబోవు ఎన్నికల్లో మరోసారి ప్రజలు జగనన్నను ఆశీర్వదించాలని ఎంపీపీ ఈరన్న, జేసీఎస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వలస గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ నాగవేణి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, గుండప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని నార్సింపల్లిలో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాతో పాటు సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, సర్పంచులు, లక్ష్మీదేవి, వినోద్, ఎంపీటీసీలు లక్ష్మినారాయణరెడ్డి, తిపమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు బాషా, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని శంకరగల్లు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగప్ప అధ్యక్షతన నిర్వహించారు. సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ , బీసీ సెల్ అధ్యక్షుడు పాండు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ మార్చండి

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి విద్యుత్ వైర్లు అడ్డంగా ఉన్నాయని లబ్ధిదారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇళ్ల నిర్మాణం టాప్ లెవెల్ వరకూ నిర్మాణం చేపట్టామని అయితే టాప్ వేయడానికి 11 కేవీ విద్యుత్ వైర్లు అడ్డంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి అడ్డంగా మారిన విద్యుత్ వైర్లను మార్చాలని కోరారు.

మార్పులు, చేర్పులపై సమీక్ష

రొళ్ల: ఓటరు జాబితాలో పేర్ల మార్పులు, చేర్పులపై తహసీల్దార్ హసీనా సుల్తానాతో చర్చించినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్ తెలిపారు. ఓటరు జాబితాలో రెండుసార్లు ఓటరుగా నమోదు అయిన వారితో పాటు గ్రామాల్లో శాశ్వతంగా లేని వారు, మరణించిన వారిని జాబితా నుంచి తొలగించాలని బూత్ లెవెల్ అధికారులకు తెలియజేశామన్నారు. 32 బూత్ కేంద్రాల్లో వారు పక్కాగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారని చెప్పారు.

సంక్షిప్త సమాచారం

అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

హిందూపురం టౌన్: ఎస్‌కే యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీల్లో ఎస్‌డీజీఎస్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ నెల 8, 9 తేదీల్లో ఎస్‌కే యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో ఎస్‌డీజీఎస్ కళాశాల విద్యార్థులు 25 మెడల్స్ సాధించారని కళాశాల కమిటీ అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి రామ్‌ప్రసాద్ తెలిపారు. అథ్లెటిక్ పోటీలలో బీబీఏ రెండవ సంవత్సర విద్యార్థిని బి.మేఘన ఉమెన్స్ చాంపియన్‌షిప్ సాధించినట్లు చెప్పారు.

యువత దేశానికి ఆదర్శంగా నిలవాలి

పరిగి: దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, మంచి సేవాభావాన్ని అలవరచుకుని దేశానికి ఆదర్శంగా నిలవాలని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. సోమవారం మండలంలోని కాలువపల్లి వద్ద ఉన్న విద్యానిధి జూనియర్ కాలేజ్‌లో దిశ చట్టం, యాంటీ ర్యాంగింగ్, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడుతూ చిన్నతనం నుంచే మంచి అలవాట్లను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షిలో...

లేపాక్షి: లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ గోపి విద్యార్థులకు ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థినులు ఇతరులతో వేధింపులకు గురికాకుండా తగిన సూచనలు, సలహాలిచ్చారు. అలాగే దిశ యాప్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు.

వైభవంగా జలధి ఉత్సవం



అలంకరణలో అమ్మాజీ ఏకుమందెమ్మ

అగళి: మండల పరిధిలోని హుళ్లేకెరె దేవరహళ్లి గ్రామంలో అమ్మాజీ ఏకుమందెమ్మ జలధి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. మండలం నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సెబ్ విస్తృత దాడులు

హిందూపురం టౌన్: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో సెబ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో తూమకుంట చెక్‌పోస్టు వద్ద 40 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేశారు. అలాగే కొల్లకుంటలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. బోయపేటలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి 32 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలో వాల్మీకి దేవాలయం వద్ద మట్కా నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని రూ.24,030 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పనులు వేగవంతం చేయండి

హిందూపురం: మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులతో అభివృద్ధి పనుల సమక్ష నిర్వహించారు. అత్యవసర పనులు గుర్తించి ఎప్పటికప్పుడు ఎస్టీమేషన్లు సిద్ధంచేసి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తహసీల్దార్‌కు న్యాయవాదుల వినతి

మడకశిరరూరల్: భూ హక్కు యాజమాన్య చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక న్యాయవాదుల సంఘం కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ మురళీవలికి వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ ఈ చట్టం వలన భూయజమాని నష్టపోయే అవకాశం ఉందన్నారు. భూ కబ్జాదారులకు, అవినీతి అధికారులకు అనుకూలంగా ఉన్న చట్టాలను రద్దు చేయాలన్నారు.

సీల్ లేకపోతే అపరాధ రుసుము



అమరాపురంలో త్రాసులను సరిచూస్తున్న సిబ్బంది

అమరాపురం: వ్యాపారస్తులు దుకాణాల్లో వాడే త్రాసులు, కొలతలు వేసే పరికరాలు తదితర వాటిపై తప్పనిసరిగా తూనికలు కొలతలశాఖ ఆధ్వర్యంలో వేసే సీల్‌ను తప్పని సరిగా వేయించుకోవాలని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని వివిధ దుకాణాలను పరిశీలించి గుర్తింపు సీల్‌పై అవగాహన కల్పించారు. సీల్ వేయించుకోని వారికి అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు.

మద్దనకుంటలో చోరీ

అమరాపురం: మండల పరిధిలోని మద్దనకుంట గ్రామానికి చెందిన మద్దెమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. మద్దెమ్మ ఊరికి వెళ్లడంతో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని నగదు, బంగారు నగలను దోచుకెళ్లినట్లు మద్దెమ్మ కుమార్తె అన్నపూర్ణ తెలిపారు. అయితే నగలు ఎంతమేర ఉన్నాయో తనకు తెలీదని, నగదు మాత్రం రూ.40 వేలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు.

ఈ- కేవైసీ తప్పనిసరి



అమరాపురంలో ఈ కేవైసీ చేయించుకుంటున్న దృశ్యం

అమరాపురం: మండలంలో డీ పట్టా ఉన్న రైతులు తప్పని సరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి భూములు తీసుకున్న రైతులు 20 సంవత్సరాలు పూరైన వారు కూడా తప్పనిసరిగా వలంటీర్ల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం డీ పట్టా ఉన్న రైతుల భూములను పట్టా భూములుగా మారుస్తోందని, అందువల్ల సంబంధిత రైతులు రెవెన్యూ కార్యదర్శులు, వలంటీర్ల ద్వారా ఈ కేవైసీ వేయించుకుంటే పట్టా భూములుగా ప్రభుత్వం మారుస్తుందని తహసీల్దార్ తెలిపారు. మండలంలోని డీ పట్టా కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

హిందూపురం టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సాధారణ ఎన్నికల నోడల్ ఆఫీసర్, సిరికల్చర్ ఏడీ సురేష్‌కుమార్, ఎంఈఓ గంగప్ప, కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప సూచించారు. సోమవారం పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు–1 సచివాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్ తెలిపారు. మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.